## బీఆర్ఎస్ మూడు ముక్కలు

**అవినీతిపరులకు బీజేపీలో చోటులేదు**

- కాళేశ్వరంపై నిష్పక్షపాతంగా సీబీఐ విచారణ
- రేవంత్ రెడ్డి ఆధారాలు ఇచ్చి సహకరించాలి
- 22 నెలలు టైంపాస్ ఎందుకు చేశారో చెప్పాల్సిందే
- ఎంపీ లక్ష్మణ్

02





# వై7 న్యూస్ తెలుగు

నిజం వైపు పయనం

R.No : TS-11-0016524

సంపుటి: 01 సంచిక: 243 బుధవారం 03.09.2025 పేజీలు: 04


## ప్రపంచం భారత్‌ని విశ్వసిస్తోంది: మోడీ

న్యూఢిల్లీ : ప్రధాని మోడీ న్యూఢిల్లీలో యశోభూమిలో 'సెమికాన్ ఇండియా' నాల్గవ ఎడిషన్‌ను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రపంచం భారత్‌ను విశ్వసిస్తుంది. భారతదేశంతో సెమీకండక్టర్ భవిష్యత్తును నిర్మించడానికి సిద్ధంగా ఉందని మోడీ అన్నారు. ఈ కాన్ఫరెన్స్‌లో 40-50 దేశాల నిపుణులు పాల్గొన్నారు. వారినుద్దేశించి మోడీ ప్రసంగించారు. 'ప్రపంచం భారతదేశాన్ని విశ్వసిస్తుందనే నమ్మకం నాకుంది. భారతదేశంతో కలిసి సెమీకండక్టర్ భవిష్యత్తును నిర్మించుకోవడానికి ప్రపంచం సిద్ధంగా ఉంది. పెట్టుబడిదారులను స్వాగతించడానికి మేము సిద్ధంగా ఉన్నాము. భారతదేశంలో తయారుచేయబడింది. రూపొందించబడింది అని ప్రపంచం చెప్పుకునేరోజు ఎంతో దూరంలో లేదు' అని అన్నారు.ఈ సందర్భంగా మొదటి త్రైమాసికంలో జిడిపి వృద్ధిరేటు 7.8 నమోదైంది. ఈ విషయాన్ని ఆయన ప్రస్తావిస్తూ.. ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు చేసే ప్రయత్నాల వల్ల ఎదురయ్యే సవాళ్లను కూడా భారత్ ఎదుర్కొంది. ఇలాంటి సమయంలో కూడా 7.8 జిడిపి వృద్ధిరేటు నమోదైంది. ఈ వృద్ధి ప్రతి రంగంలోనూ ఉంది అని ఆయన నొక్కి చెప్పారు. గత శతాబ్దం వరకు ఆయిల్ హవా కొనసాగితే.. ఇప్పుడు మాత్రం సెమీకండక్టర్‌లదేనని ఆయన ధీమా వ్యక్తం చేశారు.'సెమీకండక్టర్ ప్రపంచంలో ఆయిల్ నల్లబంగారం అని చెబుతారు. కానీ చిప్స్ (సెమీకండక్టర్లు) డిజిటల్ వజ్రాలు. మన గత శతాబ్దం చమురు హవా అయితే.. ఇప్పుడు చిన్న చిప్స్ సెమీకండక్టర్లదే. ఈ చిప్ ప్రపంచ అభివృద్ధిని వేగవంతం చేసే శక్తిని కలిగి ఉంది. భారత్ కూడా చిన్న చిప్‌తో ప్రపంచాన్ని నడిపించే రోజు ఎంతో దూరంలో లేదు 'అని మోడీ అన్నారు.



## లోకేష్‌కు అంగన్వాడీల వినతి.. మంత్రి హామీ



అంగన్వాడీలకు జీతాలు పెంచాలని కోరుతూ .. మంత్రి లోకేష్‌కు ఎపి అంగన్వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి బి.లక్ష్మీదేవి వినతిపత్రం సమర్పించారు. మంగళవారం సీకే దీన్నే మండలంలో ఐటి, విద్యాశాఖ మంత్రి లోకేష్ పర్యటించారు. ఈ సందర్భంగా మంత్రిని కలిసిన అంగన్వాడీ నాయకురాలు లక్ష్మీదేవి అంగన్వాడి కేంద్రాలలో పనిచేస్తున్న కార్యకర్తలకు, ఆయాలకు జీతాలు పెంచాలని కోరి వినతిపత్రాన్నిచ్చారు. అనంతరం లక్ష్మీదేవి మాట్లాడుతూ... చాలీచాలని జీతాలతో ఇబ్బందులు పడుతున్నామని, కనీస వేతనం అమలు చేయాలని కోరారు. అంగన్వాడీ సెంటర్లకు సన్న బియ్యం సరఫరా చేయాలని విజ్ఞప్తి చేశారు. ఇందుకు స్పందించిన మంత్రి లోకేష్ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిన వెంటనే అంగన్వాడీల వేతనాలు పెంచుతామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రూరల్ ప్రాజెక్టు అధ్యక్ష, ప్రధాన కారదర్శులు నాగలక్ష్మి, అరుణ, మండల నాయకులు శాంతమ్మ, ప్యారి జాన్ పాల్గొన్నారు.

# సాగుబడి.. సంబురం!

## వానాకాలంలో 26.85 కోట్ల ఎకరాల్లో పంటలు

ఈ వ్యవసాయ సీజన్‌లో ఇప్పటివరకు 10.74కోట్ల హెక్టార్ల (26.85కోట్ల ఎకరాలు)లో వివిధ రకాల పంటలు వేశారు. గతేడాది ఇదే సమయంలో ఉన్న 10.38కోట్ల హెక్టార్ల (26 కోట్ల ఎకరాల) కంటే ఎక్కువ. అంటే మొత్తమ్మీద 3శాతం పెరుగుదలతో 0.35 కోట్ల హెక్టార్ల పెరుగుదల నమోదైంది. పంటల వారీగా చూస్తే వరి, మొక్కజొన్న పంటలు విస్తీర్ణం పెరగ్గా, సోయా, పత్తి సాగు తగ్గుదలను నమోదు చేసుకున్నాయి.

- దేశంలోనే ఇదో సరికొత్త రికార్డ్
- గత ఏడాది 26 కోట్ల ఎకరాల్లోనే సాగు
- దేశవ్యాప్తంగా వరికే టాప్ ప్రయారిటీ
- 10.5 కోట్ల ఎకరాల్లో వరి నాట్లు పూర్తి
- ఒడిశా, బెంగాల్, బీహార్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్‌లో పెరిగిన సాగు
- తగ్గిన సోయాబీన్, పత్తి పంటలు
- మొక్కజొన్నలో కూడా పెరుగదల



### వరికే ప్రాధాన్యం..

దేశంలో ప్రధాన ఆహార పంట వరి.. ఈ ఏడాది వానాకాలం సీజన్‌లో సాధారణానికి మించి సాగు అవుతోంది. ఖరీఫ్ (వానాకాలం)లో వరి సాగు సగటు విస్తీర్ణం 4.03 కోట్ల హెక్టార్లుగా ఉండగా, ఈ సీజన్‌లో ఇప్పటివరకు 4.20కోట్ల హెక్టార్లలో వరి నాట్లు వేశారు. గత ఏడాది ఇదే సమయంలో 3.90 కోట్ల హెక్టార్లలో మాత్రమే వరి వేయగా.. ఇప్పుడు అంటే దాదాపు 8శాతం పెరుగుదల నమోదయిందని అధికారులు పేర్కొన్నారు. ఇదే సమయంలో పత్తి, నూనె గింజల సాగు గణనీయంగా తగ్గింది. ఈ వివరాలను కేంద్ర వ్యవసాయ శాఖ తన నివేదికలో వెల్లడించింది. ముఖ్యంగా ఒడిశా, పశ్చిమ బెంగాల్, బీహార్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్ రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగింది. వర్షపాతం అనుకూలంగా ఉండటం.. కనీస మద్దతు ధర హామీ, ప్రభుత్వ కొనుగోలు విధానాలు రైతుల ఉత్సాహానికి కారణమయ్యాయని వ్యవసాయ అధికారులు అంటున్నారు. మరోవైపు ఈ సీజన్‌లో దేశవ్యాప్తంగా పంటల సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగడం గమనించవచ్చు.

### పెరిగిన మొక్కజొన్న.. తగ్గిన సోయా

ఈ ఏడాది మొక్కజొన్న సాగు గతేడాదితో పోలిస్తే 12 శాతం పెరిగి 93.34 లక్షల హెక్టార్లకు చేరింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, తెలంగాణ రాష్ట్రాల్లో మొక్కజొన్న విస్తీర్ణం పెరుగుదల గణనీయంగా నమోదైంది. తక్కువ పెట్టుబడి ఖర్చులు, వర్షాభావానికి తట్టుకునే లక్షణం, పశుగ్రాసం, స్టార్చ్, బయోఫ్యూయెల్స్ పరిశ్రమల్లో పెరుగుతున్న డిమాండ్ మొక్కజొన్న సాగు విస్తీర్ణం పెరగడానికి ప్రధాన కారణాలుగా తెలుస్తోంది. రాగి, ఇతర చిరు ధాన్యాల సాగు కూడా 10శాతానికి పైగా పెరుగుదల కనిపిస్తోంది. అదే సమయంలో సోయాబీన్ సాగు విస్తీర్ణం తగ్గింది. గత ఏడాది 1.24కోట్ల హెక్టార్లలో సాగవగా, ఈసారి 1.20 కోట్ల హెక్టార్లకు మాత్రమే పరిమితమైంది. అంటే 4.77 లక్షల హెక్టార్లలో సాగు తగ్గింది. మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో రైతులు స్థిరమైన ఆదాయం కోసం సోయా నుంచి మొక్కజొన్నకు మారినట్లు వ్యవసాయ అధికారులు వెల్లడించారు.

### ఆయిల్ ఉత్పత్తిపై ప్రభావం..

సోయాబీన్ సాగు తగ్గడంతో దేశీయ ఆయిల్ సీడ్స్ ఉత్పత్తి తగ్గే ప్రమాదం ఉందని వ్యవసాయ రంగ పరిశీలకులు అంటున్నారు. కాగా, పప్పుధాన్యాల విస్తీర్ణంలో స్వల్ప వృద్ధి కనిపించింది. ఈ ఏడాది 1.12 కోట్ల హెక్టార్లలో సాగవగా, గత ఏడాది ఇది 1.11 కోట్ల హెక్టార్లలో సాగింది. అందులో మినుము 7శాతం పెరిగి 0.21 కోట్ల హెక్టార్లకు చేరుకుంది. అయితే.. కందుల సాగు 2శాతం మేరకు తగ్గినట్టు తెలుస్తోంది.

### పత్తి సాగులో వెనుకడుగు..

కీలక వాణిజ్య పంట అయిన పత్తి ఈ సీజన్‌లో తక్కువ విస్తీర్ణంలో సాగు అవుతోంది. 2024లో 1.11కోట్ల హెక్టార్లలో సాగవగా, ఈసారి 1.08 కోట్ల హెక్టార్లలో మాత్రమే రైతులు వేశారు. అంటే 2.92 లక్షల హెక్టార్లు తగ్గింది. గుజరాత్, మహారాష్ట్ర, తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాల్లో సాగు విస్తీర్ణం పెద్ద ఎత్తున తగ్గింది. వర్షపాతం లోటు, అధిక ఇన్‌పుట్ ఖర్చులు, పురుగుల బెడద.. అలాగే బియ్యం, మొక్కజొన్న వంటి పంటల నుంచి వచ్చే మెరుగైన ఆదాయం దీనికి కారణమని అధికారులు విశ్లేషిస్తున్నారు. పత్తి తగ్గుదలతో దేశీయ వస్త్ర పరిశ్రమ ఇబ్బందులు ఎదుర్కొనే అవకాశముందని నిపుణులు చెబుతున్నారు.

### నూనె గింజల సాగులోనూ..

నూనెగింజల పంటల సాగు విస్తీర్ణం కూడా తగ్గింది. గతేడాది 1.87 కోట్ల హెక్టార్లలో సాగవగా, ఈసారి అది 1.82కోట్ల హెక్టార్లకు పడిపోయింది. ముఖ్యంగా సోయా 4శాతం తగ్గగా, నువ్వులు 6శాతం, సన్ ఫ్లవర్ 9శాతం తగ్గుముఖం పట్టాయి. అయితే ఆముదాల సాగు మాత్రం 30శాతం మేర పెరగడం గమనార్హం. అదే సమయంలో చెరుకు సాగులో వృద్ధి కనిపిస్తోంది. గత ఏడాది 0.55 కోట్ల హెక్టార్లలో సాగగా, ఈ సీజన్‌లో అది 0.57 కోట్ల హెక్టార్లకు పెరిగింది. ఇక.. ఖరీఫ్ 2025 గణాంకాలు మిశ్రమ సంకేతాలు ఇస్తున్నాయి. బియ్యం, మొక్కజొన్న విస్తీర్ణం పెరగడం దేశ ఆహార భద్రతకు సానుకూలంగా ఉన్నప్పటికీ సోయా, పత్తి సాగు విస్తీర్ణం తగ్గుదల దేశ ఆర్థిక, పారిశ్రామిక రంగాలపై ప్రతికూల ప్రభావం చూపే అవకాశం ఉంది. రాబోయే రోజుల్లో వర్షపాతం, ప్రభుత్వ కొనుగోలు వ్యూహాలు, అంతర్జాతీయ మార్కెట్ ధరలు రైతుల భవిష్యత్ లాభనష్టాలను పంటల సాగు విస్తీర్ణాన్ని నిర్ణయించనున్నాయని అధికారులు చెబుతున్నారు.



(మొదటి పేజీ తరువాయి)

# బీఆర్ఎస్ మూడు ముక్కలు

○ ఎంపీ లక్ష్మణ్




**ఢిల్లీ:** కాళేశ్వరం మూడు పిల్లర్లు కూలిపోతే, బీఆర్ఎస్ మూడు ముక్కలు అయ్యిందని బీజేపీ ఎంపీ లక్ష్మణ్ అన్నారు. సీబీఐతో దర్యాప్తు చేయాలంటూ రాష్ట్ర ప్రభుత్వ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని.. అయితే 22 నెలల నుంచి సీఎం రేవంత్ రెడ్డి ఎందుకు కాలయాపన చేశారో తెలంగాణ ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్‌చేశారు. అవినీతిపరులకు తమపార్టీలో చోటు లేదని స్పష్టంచేశారు. ఢిల్లీలో లక్ష్మణ్‌మాట్లాడుతూ 'రాష్ట్రప్రభుత్వం కాళేశ్వరం ప్రాజెక్ట్ అవినీతి కేసు విషయంలో కేంద్రానికి లేఖ రాసింది. పీసీసీ చీఫ్‌గా ఉన్న సమయంలో తన దగ్గర ఆధారాలు ఉన్నాయని చెప్పిన రేవంత్ రెడ్డి.. ఇప్పుడు సీబీఐకి ఆ ఆధారాలు ఇచ్చి విచారణకు సహకరించాలి. కాగ్ కూడా అవినీతి జరిగిందని..లోపాలు ఉన్నాయని చెప్పింది. ఘోష్ కమిషన్ నివేదికలో క్రిమినల్ రిఫరెన్స్ లేకుండా రాజకీయ, అధికారుల, కాంట్రాక్టుల పాత్ర ఏంటో స్పష్టంగా చెప్పలేదు. హైకమాండ్ ఒత్తిడితో రుజువులు ఏమైనా ఇవ్వలేదా? ఎమ్మెల్సీ కవిత బహిరంగంగా హరీశ్ రావు, సంతోష్ అవినీతికి పాల్పడ్డారని చెప్పారు. అమరుల త్యాగాలను కేసీఆర్ కుటుంబం క్యాష్ చేసుకుంది. బీఆర్ఎస్ కోట్లకు పడగలు ఎత్తింది. నిష్పక్షపాతంగా సీబీఐ దర్యాప్తు జరగాలి. అవినీతిపరులను కఠినంగా శిక్షించాలి' అని అన్నారు.

# మణుగూరులో విజయ విఘ్నేశ్వర స్వామి దీపోత్సవం



మణుగూరు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా (వై7 న్యూస్): మణుగూరు సుందరయ్య నగర్‌లో విజయ విఘ్నేశ్వర స్వామి సన్నిధిలో సోమవారం సాయంత్రం భక్తిశ్రద్ధలతో దీపోత్సవం ఘనంగా జరిగింది. సుందరయ్య



నగర్ గణేష్ ఉత్సవ కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున హాజరయ్యారు. ఆలయ ప్రాంగణమంతా దీపాలతో కాంతులీనగా వెలిగిపోగా, చిన్నారులు, మహిళలు దీపాలను వెలిగించి స్వామివారిని దర్శించుకున్నారు. ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించగా,



భక్తులు తీర్థప్రసాదం స్వీకరించారు. దీపోత్సవం సందర్భంగా సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించగా, భక్తులు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో సుధా వెంకటేశ్వర్లు, అక్కినపల్లి సత్యనారాయణ, మేదరమెట్ల యాదగిరి, నక్క సురేష్, రాహుల్, నక్క వాసు, సెంట్రింగ్ ప్రసాద్, రాయగిరి నగేష్, ఎడారి శ్రీను, బంకు శివ, మహేష్, అశోక్, సంతు, చక్రీధర్, బొబ్బు రవి, తాళ్లపల్లి యాదగిరి గౌడ్, కుంట లక్ష్మణ్, సత్యనారాయణ, సాత్విక్, ధర్మ తేజ, ల్యాబ్ వెంకట్, మధుసూదన్ రెడ్డి, బంటి తో పాటు కమిటీ సభ్యులు, మహిళలు పాల్గొన్నారు.

## ఎప్పుడో మరణించిన

# మా అమ్మపై దుర్భాషలా?

### అవమానకర వ్యాఖ్యలపై మోదీ భావోద్వేగం..



ఢిల్లీ, ఉదయవాణి : బీహార్‌లో ఇటీవల కాంగ్రెస్ అగ్రనేత రాహుల్ గాంధీ ఆధ్వర్యంలో జరిగిన 'ఓటర్ అధికార్ యాత్ర'లో కొంతమంది ప్రధాని నరేంద్ర మోదీ తల్లిపై అభ్యంతరకర వ్యాఖ్యలు చేశారంటూ బీజేపీ తీవ్ర ఆరోపణలు చేసింది. ఈ క్రమంలోనే ప్రధాని మోదీ స్పందిస్తూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ అంశంపై మాట్లాడుతూ ప్రధాని మోదీ భావోద్వేగానికి లోనయ్యారు. చనిపోయిన తన తల్లిని కాంగ్రెస్–ఆర్జేడీ ఈ విధంగా దూషిస్తారని ఊహించలేదని అన్నారు. ఈ అవమానం తన తల్లికి మాత్రమే కాదు. బీహార్ తల్లులు, కుమార్తెలకు కూడా అవమానమని వ్యాఖ్యానించారు. మంగళవారం బీహార్ రాజ్య జీవిక నిధి సాఖ్ సహకారి సంఘ్ లిమిటెడ్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన సందర్భంగా చేసిన ప్రసంగంలో ఆయన ఈ కామెంట్స్ చేశారు. బిహార్ రాజ్య జీవికనిధి శాఖ సహాయ సంఘ్ లిమిటెడ్‌ను వర్చువల్‌గా ప్రారంభించిన అనంతరం ప్రధాని మోదీ సుమారు 20 లక్షల మంది మహిళలతో మాట్లాడారు. ఈ సందర్భంగా కొన్నాళ్ల క్రితం బీహార్‌లో ఆర్జేడీ–కాంగ్రెస్ రాజకీయ కార్యక్రమంలో కొందరు నేతలు తన తల్లి హీరాబెన్‌ను అవమానకరంగా దూషించారని ప్రస్తావించారు. రాజకీయ వేదికలపై చనిపోయిన తన తల్లిని లాగడాన్ని తీవ్రంగా తప్పుబట్టారు.'అమ్మే మన ప్రపంచం. అమ్మే మన ఆత్మగౌరవం. బీహార్‌లో ఆర్జేడీ–కాంగ్రెస్ నా తల్లిని అవమానించారు. అమ్మ అనారోగ్యంతో ఉన్నా.. అత్యంత పేదరికంలోనే మమ్మల్ని అందరినీ కష్టపడి పెంచింది. ఎప్పుడూ తనకోసం కొత్త చీర కొనుక్కోలేదు. మా కుటుంబం కోసం ప్రతి పైసాను పొదుపు చేసేది. నా తల్లిలాగే, నా దేశంలోని కోట్లాది మంది తల్లులు ప్రతిరోజూ 'తపస్సు' చేస్తారు.ఇప్పుడు నా తల్లి జీవించి లేదని మీ అందరికీ తెలుసు. కొంతకాలం క్రితం, 100 సంవత్సరాలు నిండాక ఆమె మనందరినీ విడిచిపెట్టి వెళ్లిపోయింది. రాజకీయాలతో నా తల్లిని ఆర్జేడీ, కాంగ్రెస్ నేతలు అవమానించారు.ఇది నా తల్లికి మాత్రమే అవమానం మాత్రమే కాదు. దేశంలోని తల్లులు, సోదరీమణులు, కుమార్తెలకు అవమానమే. నా హృదయంలో నాకు ఎంత బాధ ఉందో నాకు తెలుసు' అని ప్రధానమంత్రి అన్నారు. ఈ సందర్భంగా మోదీ పరోక్షంగా రాహుల్ గాంధీ, తేజస్వీ యాదవ్‌లను ఉద్దేశిస్తూ,'పేద తల్లి కుమారుడి బాధలు, పోరాటాన్ని రాజ కుటుంబాల్లో పుట్టిన వారు అర్థం చేసుకోలేరు.గోల్డెన్ స్పూన్‌తో జన్మించిన వారు అధికారం కుటుంబ వారసత్వంగా భావిస్తారు. కానీ బీహార్ ప్రజలు మాత్రం నన్ను ఆశీర్వదించి ప్రధానిగా మార్చారు. ఇది విషయం కొంతమంది జీర్ణించుకోలేరు' అంటూ విమర్శించారు. తన తల్లి మరణించిన తరువాత కూడా ఆమెపై అనుచిత వ్యాఖ్యలు రావడం బాధాకరమని మోదీ తెలిపారు. రాజకీయాల్లో విమర్శలు సహజమే అయినా, వ్యక్తిగత దూషణలు సాంప్రదాయాలకు, భారతీయ సంస్కృతికి అనర్హమని ఆవేదన వ్యక్తం చేశారు. ఇటీవల కాంగ్రెస్ నిర్వహించిన బీహార్ సభలో కొన్ని అభ్యంతరకర వ్యాఖ్యలు చేసినట్టు బీజేపీ ఆరోపించింది.ఈ ఘటనపై పాట్నా పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా.. ఇప్పటికే ఓ వ్యక్తిని అరెస్టు చేశారు. ఈ విషయమై కేంద్ర హోంమంత్రి అమిత్‌షా కూడా స్పందించారు. రాహుల్ గాంధీ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు.

# ఎమ్మెల్సీ పదవికి కవిత రాజీనామా..?

హైదరాబాద్, వై 7 తెలుగు న్యూస్ ప్రతినిధి: బీఆర్ఎస్ నాయకురాలు ఎమ్మెల్సీ కవిత మరో సంచలన నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. తన ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని భావిస్తున్నట్లు సమాచారం అందుతోంది. అదే సమయంలో బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి కూడా రాజీనామా చేయాలని భావిస్తున్నారట. త్వరలో కవిత కొత్త పార్టీని ప్రకటిస్తారని కూడా ఆమె అనుచరులు చెబుతున్నారు. ఈ నేపథ్యంలోనే బుధవారం నాడు ఎమ్మెల్సీ కవిత మీడియా ముందుకు వస్తారని.. మీడియా ముఖంగానే భవిష్యత్ కార్యాచరణను ప్రకటిస్తారని ఆమె అనుచరులు చెబుతున్నారు.ఇటీవలి కాలంలో కవిత ప్రవర్తనా తీరు పార్టీకి నష్టం చేకూర్చే విధంగా ఉందంటూ బీఆర్ఎస్ అధిష్టానం ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్లు ప్రకటించింది. ఈ మేరకు అధికారిక ప్రకటన విడుదల చేసింది బీఆర్ఎస్ అధిష్టానం. అయితే, తనను పార్టీ నుంచి సస్పెండ్ చేయడంతో కవిత.. తన ముఖ్య అనుచరులతో సమాలోచనలు జరుపుతున్నారు. ఈ క్రమంలోనే బీఆర్ఎస్ పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయాలని నిర్ణయించుకున్నారు. అంతేకాదు.. ఎమ్మెల్సీ పదవిపై బీఆర్ఎస్ ఫిర్యాదు చేయకముందే ఆ పదవికి కూడా రాజీనామా చేయాలని కవిత భావిస్తున్నారు. ఈ విధంగా బీఆర్ఎస్ పార్టీతో పూర్తిగా తెగదెంపులు చేసుకోవాలనే యోచనలో కవిత ఉన్నారని ఆమె అనుచరులు చెబుతున్నారు.




**త్వరలో కొత్త పార్టీ..?**

లిక్కర్ స్కామ్ కేసులో జైలు నుంచి బయటకు వచ్చినప్పటి నుంచి పార్టీ లైన్ దాటి అడుగులు వేస్తూ వస్తున్న కల్వకుంట్ల కవిత.. త్వరలోనే కొత్త పార్టీ పెట్టాలని నిర్ణయం తీసుకున్నారట. ఇప్పటికే జాగృతిని బలోపేతం చేస్తూ వచ్చిన కవిత.. అదే పేరుతో గానీ.. మరో పేరుతో గానీ కొత్త పార్టీ పెట్టాలని భావిస్తున్నారట. కొత్త పార్టీ ఏర్పాటుకు సంబంధించి సన్నాహాలు కూడా ప్రారంభించారని సమాచారం. బీఆర్ఎస్ నుంచి సస్పెన్షన్ ప్రకటన రావడంతో.. కొత్త పార్టీ వ్యవహారంలో కవిత మరింత స్పీడ్ పెంచనున్నట్లు తెలుస్తోంది.

# బీఆర్ఎస్ నుండి కవిత సస్పెండ్..

హైదరాబాద్, వై 7 తెలుగు న్యూస్ సెప్టెంబరు 2: బీఆర్ఎస్ సంచలన నిర్ణయం తీసుకుంది. గులాబీ పార్టీ ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేసింది. ఈ మేరకు బీఆర్ఎస్ హై కమాండ్ ఓ ప్రకటన విడుదల చేసింది. కాగా గత కొంతకాలంగా బీఆర్ఎస్‌కు వ్యతిరేకంగా కవిత విమర్శలు చేస్తున్నారు. ఈ క్రమంలోనే గులాబీ పార్టీ చర్యలకు ఉపక్రమించినట్లు తెలుస్తోంది. బీఆర్ఎస్ బీజేపీలో కలవబోతుందని ఆమె షాకింగ్ కామెంట్స్ చేశారు. కవిత గత కొంతకాలంగా పార్టీ వ్యతిరేక చర్యలకు పాల్పడుతోందని బీఆర్ఎస్ నేతలు విమర్శించారు. ఈ క్రమంలో సోమవారం అమెరికా నుంచి రాగానే కాళేశ్వరం ప్రాజెక్టు గురించి కవిత షాకింగ్ విషయాలు వెల్లడించారు.





భారత రాష్ట్ర సమితి
BHARAT RASHTRA SAMITHI
Office : Telangana Bhavan, Road No : 10, Banjara Hills, Hyderabad 500 034.

Date: 02.09.2025

పార్టీ MLC శ్రీమతి కే. కవిత ఇటీవలి కాలంలో ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాలు బి.ఆర్.ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున పార్టీ అధిష్టానం ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణిస్తున్నది.

పార్టీ అధ్యక్షులు శ్రీ కె. చంద్రశేఖర్ రావు గారు శ్రీమతి కె. కవిత ను తక్షణం పార్టీ నుండి సస్పెండ్ చేస్తూ నిర్ణయం తీసుకున్నారు.

సోమ భరత్ కుమార్
ప్రధాన కార్యదర్శి
పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు

టి. రవీందర్ రావు
ప్రధాన కార్యదర్శి

ఈక్రమంలో మాజీ మంత్రి తన్నీరు హరీష్‌రావు, బీఆర్ఎస్ నేత సంతోష్‌రావులపై కవిత సంచలన ఆరోపణలు చేశారు. ఈ ఆరోపణలపై కూడా కేటీఆర్, హరీష్‌రావు స్ట్రాంగ్ కౌంటర్ ఇచ్చారు. కవిత ప్రస్తుతం తెలంగాణ జాగృతి తరపున కార్యకలాపాలు నిర్వహిస్తున్నారు. ఇప్పుడు కవిత ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని అందరూ ఉత్కంఠంగా ఎదురుచూస్తున్నారు.

# బాల్య వివాహాలు అన్ని దేవాలయాల్లో నిషేధం

## – దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ ఎం. వీరస్వామి




కొత్తగూడెం, సెప్టెంబర్ 02 (వై7 న్యూస్): బాల్యవివాహాలను నిర్వహించడం లేదా ప్రోత్సహించడం చట్టరీత్యా నేరమని దేవాదాయ ధర్మాదాయ సహాయ కమిషనర్ ఎం. వీరస్వామి స్పష్టం చేశారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్మెంట్ (ఎయిడ్), జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్ సంస్థల ఆధ్వర్యంలో బాల్యవివాహాల నిర్మూలన కోసం రూపొందించి 'హెచ్చరిక బోర్డు ను ఆయన తన కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రభుత్వంతో కలిసి నిరంతరం కృషి చేస్తున్న ఎయిడ్ సంస్థ కార్యక్రమాలను ప్రశంసించారు. ఆలయాల వద్ద అందరికీ కనిపించేలా హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులకు రాతపూర్వక ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఆలయ ప్రాంగణం లేదా ఇతర ఏ ప్రదేశంలోనైనా బాల్యవివాహాలు జరపరాదని పురోహితులకు, ఆలయ సిబ్బందికి స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు పేర్కొన్నారు. చట్టానికి విరుద్ధంగా ఎవరు బాల్యవివాహాలు జరిపించినా, బాల్య వివాహ నిరోధక చట్టం – 2006 ప్రకారం లక్ష రూపాయల జరిమానా, రెండు సంవత్సరాల వరకు జైలు శిక్ష తప్పనిసరిగా విధించబడుతుందని హెచ్చరించారు. ఎవరైనా బాల్యవివాహాలు జరుగుతున్నట్లు గమనిస్తే వెంటనే చైల్డ్ హెల్ప్ లైన్ 1098 లేదా డయల్ 100కు సమాచారం ఇవ్వాలని సూచించారు. ఎయిడ్ సంస్థ డైరెక్టర్ పి.ఎస్.ఎస్. హరి ప్రసాదరావు మాట్లాడుతూ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో బాల్యవివాహాలను నిర్మూలించడానికి నిరంతరం అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని, బాల్యవివాహాల నిర్మూలనకు ప్రతిజ్ఞలు చేయిస్తూ ప్రజలను చైతన్యవంతం చేస్తున్నామని తెలిపారు. బాల్యవివాహ ముక్తి భారతం నినాదంతో 2030 నాటికి బాల్యవివాహాలు లేని దేశాన్ని నిర్మించడం మన అందరి లక్ష్యమని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఎయిడ్ సంస్థ జిల్లా కోఆర్డినేటర్ వి. రాజేష్, కే. శ్రీనివాస్, సహాయ కమిషనర్ కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# కాళేశ్వరం పై కాంగ్రెస్ రాజకీయం చేస్తుంది



బాన్సువాడ సెప్టెంబర్ 2 వై సెవెన్ న్యూస్: కోటగిరిమండల కేంద్రంలో బి ఆర్ ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆదేశాల మేరకు కాళేశ్వరం ప్రాజెక్టు కమిషన్ నివేదిక సీబీఐ విచారణ చేపట్టాలని రాష్ట్ర ప్రభుత్వం మొండి వైఖరి చేస్తున్న విధానాన్ని వ్యతిరేకిస్తూ మండల కేంద్రంలో బస్టాండ్ వద్ద ధర్నా జరిగింది. రాష్ట్ర ప్రభుత్వం 420 హామీలు 13 గ్యారెంటీలు అమలు చేయాలని కోరుతూ 14 సంవత్సరాలు కొట్లాడిన మహా నాయకుడు 10 సంవత్సరాలు దేశంలో అద్భుతమైన పరిపాలన అందించిన మహా నాయకుడు కెసిఆర్ అలాంటి మహా నాయకుడు పైన సీబీఐ విచారణ కేసు వెనకకి తీసుకోకపోతే రాష్ట్రంలో ఉన్న ముఖ్యమంత్రి మంత్రులు ఎమ్మెల్యేను అడుగడుగునా అడ్డుకుంటామని మండల బి ఆర్ ఎస్ పార్టీ తరపున హెచ్చరిస్తున్నాం రాబోయే రోజుల్లో వచ్చే స్థానిక సంస్థ ఎలక్షన్లో రాష్ట్ర ప్రజలు బుద్ధి చెప్పే రోజులు దగ్గర్లో ఉన్నాయని మండల బి ఆర్ ఎస్ పార్టీ తరపున హెచ్చరిస్తున్నాం. ఈ కార్యక్రమంలో మండల నాయకులు మాజీ ఎంపీపీ వల్లేపల్లి శ్రీనివాసరావు. తెల్ల రవికుమార్ మోరే కిషన్ సమీర్ బొట్టే గజంధర్ కర్ణ గజంధర్ కప్ప సంతోష్, శ్రీనివాస్ గౌడ్ . మోర్ గౌతం నజీర్ తేళ్ల చిన్న అరవింద్ మహేష్ రెడ్డి మామిడి, నవీన్ పోతంగల్ మండల్ అధ్యక్షుడు నవీన్, సాగర్,ఎంపి అకీం బి ఆర్ ఎస్ పార్టీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

# మిలిటెన్సీ పోరాటాలపై పునాది సీపీఐ బలోపేతం



మణుగూరు, సెప్టెంబర్ 02 (వై7 న్యూస్): మిలిటెన్సీ పోరాటాల ద్వారా ప్రజా సమస్యలు పరిష్కారం అవుతాయని, ఎన్నో త్యాగాల పునాదిపై సీపీఐ గ్రామ గ్రామాన బలపడిందని జిల్లా కార్యదర్శి ఎస్.కే. సాబీర్ పాషా పేర్కొన్నారు. మంగళవారం మణుగూరులోని కిన్నెర కల్యాణ మండపంలో పినపాక నియోజకవర్గ సీపీఐ జనరల్ బాడీ సమావేశం జరిగింది. సాబీర్ పాషా మాట్లాడుతూ, పినపాక నియోజకవర్గం ఎన్నో ఉద్యమాలకు, త్యాగాలకు కేంద్రబిందువైందని గుర్తు చేశారు. భూస్వామ్య వ్యతిరేక పోరాటాల్లో పేదలకు భూములు పంచిపెట్టిన చరిత్ర ఈ ప్రాంత కమ్యూనిస్టు నాయకులదని అన్నారు. బీటీపీఎస్ నిర్మాణం సందర్భంగా నిర్వాసితులకు ఉద్యోగాలు ఇప్పించడంలోనూ, సింగరేణి కార్మికులు, రైతులు, కూలీల సమస్యల పరిష్కారంలోనూ సీపీఐ పోరాటం ముందుండిందని గుర్తుచేశారు. రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ముత్యాల విశ్వనాథం, కల్లూరు వెంకటేశ్వరరావు మాట్లాడుతూ, అయోధ్య గారి త్యాగాలను స్మరించుకుంటూ ఆయన ఆశయ సాధన కోసం స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థులను గెలిపించాల్సిన అవసరాన్ని నొక్కిచెప్పారు. ఈ కార్యక్రమంలో సరెడ్డి పుల్లారెడ్డి, మువ్వా వెంకటేశ్వరరావు, మున్నా లక్ష్మీకుమారి, కామటం వెంకన్న, ఏసీ ఎల్లయ్య, దుర్గాల సుధాకర్, జక్కుల రాజబాబు, ఎడారి రమేష్, వై రాంగోపాల్, సోందే కుటుంబరావు తదితరులు పాల్గొన్నారు. అమరవీరులకు జోహార్లు అర్పిస్తూ మౌనం పాటించిన అనంతరం, స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ బలాన్ని చాటేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని నిర్ణయించుకున్నారు

# వైస్సార్ ఆశయాలను కొనసాగించిన జగన్

## – మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు



పలాస, సెప్టెంబర్ 02 వై 7 న్యూస్: పలాస లో మాజీ ముఖ్యమంత్రి వై స్ రాజశేఖర్ రెడ్డి ఆశయాలను ఆయన తనయుడు జగన్మోహన్ రెడ్డి కొనసాగించాలని మాజీ మంత్రి సిదిరి అప్పలరాజు అన్నారు. మంగళవారం వై యస్ రాజశేఖరరెడ్డి 16 వ వర్ధంతి సందర్భంగా కాశీబుగ్గ హైస్కూల్ రోడ్డు గల వై యస్ ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. పంట పొలాలకు నీరు అందించే విషయం లో రాజశేఖరరెడ్డి ఎనలేని కృషి చేసారన్నారు. నాయకులు కార్యకర్తలు అభిమానులు పాల్గొన్నారు.

# గొంతు కోసుకొని వ్యక్తి ఆత్మహత్యయత్నం



పలాస, సెప్టెంబర్ 02 (వై7 న్యూస్): పలాసకు చెందిన కోరాడ గవరయ్య (35) మంగళవారం ఉదయం పదునైన ఆయుధంతో గొంతు కోసుకొని ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. ఈ దృశ్యం గమనించిన కుటుంబ సభ్యులు అతనిని తక్షణమే పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ ప్రాథమిక చికిత్స అందించిన వైద్యులు, పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం శ్రీకాకుళం రిమ్స్ హాస్పిటల్‌కు తరలించారు. ఈ సంఘటనపై సమాచారం అందుకున్న కాశీబుగ్గ పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు.

# ఎయిర్‌పోర్ట్ సాధనకై హరిపురంలో కీలక సమావేశం



పలాస, సెప్టెంబర్ 02 (వై7 న్యూస్): మందస మండలం హరిపురం గ్రామంలో మంగళవారం ఎయిర్‌పోర్ట్ సాధన కమిటీ ఆధ్వర్యంలో కీలక సమావేశం జరిగింది. ఈ ప్రాంత అభివృద్ధికి ఎయిర్‌పోర్ట్ అత్యవసరమని, దాని సాధన కోసం చేపట్టాల్సిన చర్యలపై ఈ సమావేశంలో విస్తృతంగా చర్చించారు. కమిటీ సభ్యులు మాట్లాడుతూ, స్థానిక ఎమ్మెల్యే గౌతు శిరీష, కేంద్ర మంత్రి రామ్మోహన్ నాయుడు దృష్టికి ఈ అంశాన్ని తీసుకెళ్లి త్వరితగతిన చర్యలు తీసుకునేలా కృషి చేస్తామని తెలిపారు. సమావేశంలో ఉద్ధన ప్రాంత రైతులు, ఎయిర్‌పోర్ట్ సాధన కమిటీ సభ్యులు, టీడీపీ నాయకులు వోజ్జ బాబురావు, బడా నాగరాజు, కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# పవన్ కళ్యాణ్ 54వ జయంతి సందర్భంగా ఉచిత సేవా కార్యక్రమాలు



మణుగూరు, సెప్టెంబర్ 02 (వై7 న్యూస్): డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ 54వ పుట్టినరోజు సందర్భంగా, పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ఫ్యాన్స్ సేవా సంఘం ఆధ్వర్యంలో మున్సిపల్ కార్మికులకు ఉచిత సేవా కార్యక్రమాలు చేపట్టారు. పసునూరి భాస్కర్ సలహా మేరకు మణుగూరు మున్సిపల్ కార్మికులకు 45 రైన్ కోట్స్ అందజేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా మున్సిపాలిటీ కమిషనర్ టి. ప్రసాద్, మేము సైతం మిత్ర మండలి చారిటబుల్ ట్రస్ట్ సెక్రటరీ, ప్రెస్‌క్లబ్ సెక్రటరీ మార్తి శ్రీనివాసరావు, ట్రెజరర్ రంగా శ్రీను, బేతంచెరల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ గారి సేవా స్ఫూర్తి ప్రతి ఒక్కరికీ ఆదర్శమని, అభిమానులు చేపడుతున్న సేవా కార్యక్రమాలు సమాజానికి ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పవర్ స్టార్ ఫ్యాన్స్ సేవా సంఘం సభ్యులు ప్రెసిడెంట్ ముజ్జు, వైస్ ప్రెసిడెంట్ నునవత్ సాయి, సోషల్ మీడియా అధ్యక్షుడు సల్లూరి మధు (RMP), ఈవెంట్ ఆర్గనైజర్స్ తుంగల వెంకటేష్, రేగళ్ల హరీష్, కొమరం రాజు, భూక్యా రాజేష్, బాలు, జీవన్, రామ్మోహన్ రావు, దేగల సంపత్, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

వై7 తెలుగు న్యూస్
నిజం వైపు పయనం


# సినిమా వార్త



## ఓటీటీలోకి కన్నప్ప



**టాకీస్:** మంచు విష్ణు డ్రీమ్ ప్రాజెక్ట్‌గా పాన్ ఇండియా స్థాయిలో వచ్చిన మూవీ 'కన్నప్ప'. ఈ ఏడాది జూన్ 27న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రానికి మంచి టాక్ వచ్చినా, అనుకున్న స్థాయిలో మాత్రం వసూళ్లు రాలేదు. ముఖేష్ కుమార్ సింగ్ తెరకెక్కించిన ఈ సినిమాలో బాలీవుడ్ స్టార్ అక్షయ్ కుమార్, యంగ్‌రెబల్‌స్టార్ ప్రభాస్, మోహన్ లాల్, శరత్ కుమార్, మోహన్ బాబు, బ్రహ్మానందం, కాజల్ అగర్వాల్ లాంటి స్టార్స్ కీలక పాత్రల్లో నటించారు. అయితే ఈ మూవీ రిలీజై రెండు నెలల దాటినా ఇప్పటికీ ఓటీటీకి రాలేదు. దీంతో ఎప్పుడొస్తుందా అని ఆడియన్స్ ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. తాజాగా 'కన్నప్ప' ఓటీటీ రిలీజ్ కు రెడీ అయ్యింది. ఈనెల నాలుగో తేదీ నుంచి స్ట్రీమింగ్ చేయనున్నట్లు హీరో మంచు విష్ణు సోషల్ మీడియాలో పోస్ట్ చేశాడు. తెలుగుతో పాటు తమిళ, కన్నడ, హిందీ, మలయాళ భాషల్లో అమెజాన్ ప్రైమ్‌లో స్ట్రీమింగ్ కానుందని వెల్లడించాడు. ఈ సినిమాను అవా ఎంటర్‌టైన్‌మెంట్స్, 24 ఫ్రేమ్స్ ఫ్యాక్టరీ బ్యానర్లపై సంయుక్తంగా నిర్మించారు.

## ప్రతీ బాల్ సిక్సర్ కొడుతున్న 'ఓజి' మేకర్స్!




రెండు తెలుగు రాష్ట్రాల ఒకే ఒక్క పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ పుట్టినరోజు నేడు కావడంతో ఆ హంగామా యుఫోరియా అంతా నెక్స్ట్ లెవెల్లో కనిపిస్తుంది. సినీ నటులు నుంచి రాజకీయ నాయకులు దేశ ప్రధాని నరేంద్ర మోడీ వరకు కూడా అనేకమంది విషెస్ చెప్పారు. ఇక ఈ హై మూమెంట్స్ తో పాటుగా పవన్ సినిమా అప్డేట్స్ అభిమానులకి ఇంకో బోనస్ అని చెప్పాలి.ఇక ఈ సినిమాల్లో 'ఓజి' చిత్రం నుంచి వస్తున్న ప్రతీ అప్డేట్ కూడా ఒక సిక్సర్ లా నిలుస్తుంది అని చెప్పడంలో ఎలాంటి సందేహం లేదు. అనౌన్స్మెంట్ చేసిన రోజు నుంచి ఇప్పుడు వచ్చిన గన్స్ అండ్ రోజెస్ గ్లింప్స్ వరకు కూడా మేకర్స్ చూపించిన క్వాలిటీ, సుజీత్ విజన్ గాని ఎక్కడా చిన్నది కూడా ఫ్యాన్స్ ని డిజప్పాయింట్ చేసింది లేదు. దీనితో ఒకో అప్డేట్, పోస్టర్, టీజర్, పాట, గ్లింప్స్ లతో అంచనాలు పెరుగుతూనే వెళుతున్నాయి తప్పితే తగ్గిన ఆనవాలు కూడా లేదు. ఈ రేంజ్ లో ఓజి చుట్టూతా పాజిటివ్ ఆరా కనిపిస్తుంది. మరి ఈ సెప్టెంబర్ 25 వరకు ఇదే కంటిన్యూ అయ్యి సాలిడ్ టాక్ పడితే మాత్రం ఓజి బాక్సాఫీస్ ర్యాంపేజ్ కి ఆకాశమే హద్దని చెప్పాలి.



## పరమ్ సుందరి వెనకంజ

సిద్ధార్థ్ మల్హోత్రా, జాన్వి కపూర్ జంటగా వచ్చిన క్రాస్‌కల్చర్ రొమాంటిక్ ఎంటర్‌టైనర్ పరమ్ సుందరి మొదటి వీకెండ్ వరకు మంచి కలెక్షన్లు సాధించినప్పటికీ సోమవారం వెనకబడి పోయింది. దేశీయ వసూళ్లు నాలుగు రోజుల్లో మొత్తం ₹30.25 కోట్లు వద్ద ఆగాయి. శనివారం హయ్యెస్ట్‌గా 9.25 కోట్ల కలెక్షన్లు రాగా.. సోమవారం 3.50 కోట్లకు పరిమితమైంది. దీంతో ఈ చిత్రం ముందుకు సాగుతుందా..? లేదా..? అన్న అనుమానాలు మొదలయ్యాయి. ఇక జాన్వి కపూర్ గత చిత్రం ఉలజ్ ₹11.05 కోట్లు మాత్రమే వసూలు చేసింది. సిద్ధార్థ్ మల్హోత్రా మాత్రం యోధా (₹35.74 కోట్లు), థాంక్ గాడ్ (₹36.35 కోట్లు)తో పెద్దగా విజయం సాధించలేకపోయాడు. ఈ నేపథ్యంలో పరమ్ సుందరి మంచి కలెక్షన్లతో మొదలైనా, లాంగ్ రన్‌లో ఎలా ఆడుతుందనుది హాట్ టాపిక్ గా మారింది.